మధ్యాహ్నం ఇంకా కాలేదు. సాయమాను కింద యల్లమ్మ కూర్చొని ఆకాశం వైపు సాలోచనగా చూస్తూ, చేత్తో నేలను రాయసాగింది. ఇంతలో ఆమె భర్త  దుర్గయ్య నెత్తిన కండువ వేసుకొని, చెమటలు కక్కుతూ  ఇంట్లోకి వచ్చాడు. యల్లమ్మను పలకరించకుండానే గోళం దగ్గరికి పోయి ముఖంపై నీళ్ళు చల్లుకున్నాడు.

''అమ్మయ్య!  ఏమెండ ఏమెండ?! అగ్గి కురుత్తంది. ఇప్పుడే గిట్లుంటే రేపు రోణి కార్తెలో ఎట్లుండాల?'' భార్యవైపు చూస్తూ అన్నాడు దుర్గయ్య.

# చకోర జీవితాలు

## యెన్నం ఉపేందర్




యల్లమ్మ దగర నుంచి ఏ సమాధానం రాకపోయేసరికి దుర్గయ్య,

''సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మో
సినబోయి కూకున్నా వెందుకమ్మో...''

అంటూ పాడసాగాడు.

అది విన్న యల్లమ్మ, ''ఎహే! ఊర్కో. ఓ రోకు ఎండలు దంచి కొడ్తన్నై. ఈ యేడు తిండిగాసం ఎట్లనని నేను రంధిపడ్తాంటే పదం పాడ్తన్నవు?'' భర్తపై చిరుకోపం ప్రదర్శించింది యల్లమ్మ.

దానికి దుర్గయ్య,

''ఓర్ని! రంధి ఎందుకే? కట్టాలు మొదలుపుట్టి మనం తర్వాత పుట్టినామే! కొత్తగా బాధపడేదేముంది? వాన రాకడ పానం పోకడ ఎవరికి తెల్సు! అంతా దేవుడి దయ'' అన్నాడు.

మౌనం, ఆ తర్వాత సంభాషణల్ని మింగేసింది.

అదొక పల్లెటూరు. ఊరు చుట్టూ, ఊరు మధ్యా దేవుళ్ళ దేవతల విగ్రహాలున్నాయి. సంవత్సర కాలంలో, ఏదో రోజున ఆ విగ్రహాలకు కొలుపులు జరుగుతూనే వుంటాయి.

చెరువు నిండిందన్నా, నిండలేదన్నా జంతుబలులు జరగటం సాధారణం, ఆ వూర్లో. 'చేతబడి జరిగిందన్న అనుమానం వచ్చినా' 'ఏ కాలు నొప్పో కడుపునొప్పో'



వచ్చిందన్నా ముడుపులు కట్టడం జరుగుతుంటుంది.

బజార్లో దొర పిలుపులకు దుర్గయ్య ఆలోచనల్నించి తేరుకున్నాడు.

దుర్గయ్యను చూస్తూనే దొర,

"నారాయణ లేడా? లగ్గం దగ్గరకొస్తంది. చీర నెయ్యమని చెప్పిన. నేసిండా" ప్రశ్నించాడు.

ఎన్నడూ లేనిది దొర తమ ఇంటి దగ్గరకొచ్చేసరికి తత్తరపడుతూ దుర్గయ్య,

"అన్న.. అన్న సంతకు బోయిండు. ఒచ్చినంక సెప్త" అన్నాడు.

దుర్గయ్య, నారాయణలు అన్నదమ్ములు. నారాయణ చేతి మగ్గంతో తువ్వాల్లు, చీరలు, లుంగీలు నేస్తుంటాడు. దుర్గయ్యకు కాస్త పొలం వుంది. అన్నలా మగ్గాన్ని నమ్ముకోక నాగల్ని నమ్ముకున్నాడు. వారికి జరుగుబాటు కష్టంగానే వుంది.

ఆ యేడు అరకొరగా వర్షాలు పడ్డాయి.

పొలానికి పెట్టుబడి కోసం దుర్గయ్య షావుకారు ఇంటికి వెళ్ళాడు.

దుర్గయ్యను చూసిన షావుకారు కనకయ్య, "దుర్గయ్యా! ఏంది సంగతి. దారి తప్పొచ్చినవు", పలకరించాడు.

"సెల్ల కొద్దో గొప్పో నీళ్ళొచ్చినయి. ఈయేడు పొలం నాటు పెట్టాలనుకుంటున్న. సేతిల దమ్మిడి లేదు. కొద్దిగా అప్పిస్తే..." దుర్గయ్య మాటలు పూర్తి కాలేదు.

"కత బాగుంది. పోయినేడాది యిచ్చిన రూపాయలే ఇయ్యలేదు! ఫైనంగా మల్లియ్యాలంటే ఎట్ల?" ప్రశ్నించాడు కనకయ్య.

"మీరు కాదంటే ఎట్ల. వడ్డీతో సహా ఇత్త. మీ రుణం ఉంచుకుంటానా? " అన్నాడు దుర్గయ్య, బతిమలాడుతున్నట్టుగా.

షావుకారు మెత్తబడ్డాడు.

"సర్లే! కాయితం రాయించి తీస్కపో డబ్బు. పైసలు పంట పండంగనే యియ్యాల బిడ్డా! అయి టంక మాట రావద్దు" కండిషన్ పెట్టాడు కనకయ్య.

ఆరోజు రాత్రి నులక మంచంపై పడుకొని, చుక్కల వైపు చూస్తున్న నారాయణతో అతని భార్య లక్ష్మి "ఎంత కాలమిలా 'తట్కుం మిట్కుం' అంటూ సుంచు సేతబట్టుకుంటవు? ఎదుగుబొదుగు లేని సంసారమైపాయే!" ఆవేదన వ్యక్తపరిచింది.

"ఏంజేయమంటవే! వయసు మీదబడబట్టే! కాలం సూడబోతే కటపిటగా ఉంది. జనం మునపటి లెక్కా మగ్గం మీద నేసిన గుడ్డలు కడ్తలేరు. మిల్లు బట్టొచ్చి, మన కడుపులు కొట్టే! దానికి తోడు నూలుపై ఎక్కువ సుంకం వసూలు జేయబట్టిరి. రంగుల ధరలు చూడబోతే ఆకాశాన్ని ఎగిరే! మిల్లుబట్టలెక్క నేత బట్ట నునుపు లేదని జనం పట్నంబోయి కొనుక్కొచ్చుకుంటండ్రి. మిల్లు బట్టలెక్క డిజైన్లు ఎయ్యటం మగ్గం మీద అయ్యిద్దా? పొద్దస్తమానం తిర్గి తిర్గి కాళ్ళు నొప్పి పుట్టబట్టే! ఒక్క బట్ట అమ్ముడుపోదాయే!" ఆవేదన వెలిబుచ్చాడు నారాయణ.

అది విన్న లక్ష్మి, "మా పుట్టింట్ల సూరత్‌కు బత్కబోయిండ్రు. ఆడ సాంచన్లు నడిపించుకుంట, ఇంత డబ్బు ఎన్కేస్తన్నమని మా తమ్ముడు మతలబు జేసిండు. నువు గూడా సూరత్‌కు బోరాదే" అడిగింది.

నారాయణ కొద్దిసేపు ఆలోచించి, 'సరే' అన్నాడు. మబ్బుతెరలు తొలగించుకుని చంద్రుడు కనిపించీ, మరల మబ్బులెనకాల దాక్కున్నాడు. ఆ రాత్రంతా నారాయణ ఆలోచిస్తూనే ఉన్నాడు.

"తానైతే సరేనని అన్నాడు. సూరత్‌కు బోయి నేను పనిజేత్తానా? కాని ప్రదేశం. చుట్టూ పదూళ్ళు తిర్గిన కని పట్నమే పోలే ఇంతవరకు! సూరత్‌కు బోయి సాంచలు నడపగల్గుతనా?" పరిపరివిధాల ఆలోచించసాగాడు నారాయణ.

***

షావుకారు ఇచ్చిన డబ్బులు తీసుకొని మండల కేంద్రానికి, విత్తనాల కోసం వెళ్ళాడు దుర్గయ్య.

హైబ్రిడు విత్తనాలయితే దిగుబడి ఎక్కువ వస్తుందని దొర చెప్పితే, తెచ్చి, నానబోసి మండె కట్టాడు దుర్గయ్య. త్వరత్వరగా దుక్కి దున్ని, చాలు ఇరువాలు పెట్టి మడి కరిగట్టు చేశాడు, చెరువు నీళ్ళతో. మండెకట్టిన పదోదినాన మండె విప్పారు దుర్గయ్య దంపతులు. విత్తనాలు పూర్తిగా మొలకెత్తలేదు. అది చూసి యల్లమ్మ లబోదిబోమని మొత్తుకోసాగింది.

"ఓర్నాయనో! అయిబ్రేడు విత్తనాలని డబ్బుల్దగలేసి తీస్కొచ్చిన్నవు? మొలక సూడబోతే మొత్తానికి మొత్తమే గరిబోయింది. మన కొంపకు నీళ్ళొచ్చినయి. ఇంగ ఏంజేసేదిరా దేవుడా" శోకం పెంచింది యల్లమ్మ.

తాను తీసుకొచ్చిన విత్తనాలు సరైనవి కావని, విత్తన కేంద్రం వారు తనను మోసం చేశారని దుర్గయ్య దిగులుతో ఆరోజు భోజనం చేయలేదు. 'అయిందేదో అయింది' అనుకొని, ఓపిగ్గా, మొలక వచ్చినంత వరకు గంపల్లోకి ఎత్తుకొని పొలంలో చల్లాడు. పొలం చాలాభాగం ఖాళీగానే ఉండటం చూసి, ఊళ్ళోని ఆసాముల్నందర్ని విత్తనాల వడ్లు కావాలని అడిగాడు. ఎవరు ముందుకు రాలేదు. మరలా షావుకార్ని బతిమలాడి అప్పుకింద విత్తనాల వడ్లు తీసుకున్నాడు. మరలా వాటిని నానబోసి, వచ్చిన మొలకని మిగతా పొలంలో చల్లాడు. నాటేసింది మొదలు రకరకాల ఎరువుల్ని వేయాల్సి వచ్చింది. ఎంత మోతాదులో పురుగు మందులు, ఎరువులు వాడాలో తెలియక ఆశించిన ఫలితాలు రాకపోయేసరికి దుర్గయ్యకు దిగులు పట్టుకుంది.

"ఎట్టనో అట్ల డబ్బు గుంజుకొచ్చి, పెట్టుబడైతే పెడ్తున్నా. రేప్పొద్దున గింజలెల్లబోతే ఉరిబెట్టుకుండుడే మిగులుద్ది..."

ఇదిలా వుండగా చెరువులో నీళ్ళు బాగా తగ్గి, అరకొరగా పంట పొలాలకు రాసాగాయి. దుర్గయ్య పొలం తూముకు సమీపాన ఉండటం మూలాన నీళ్ళకు కొరత లేదు. దుర్గయ్య పొలాన్ని దాటి దొర పొలానికి నీళ్ళు పారాల్సి వుంది. ఎప్పుడు కూడా దుర్గయ్య పొలం నీళ్ళతో నిండి ఉండటం, దొరకు కంటగింపుగా ఉండేది. దానికితోడు నీళ్ళు అరకొరగా ఉండటంతో, ఎలాగైనా దుర్గయ్య పొలానికి నీళ్ళు రాకుండా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఓరోజు దుర్గయ్యతో దొర,

"దుర్గా! సెల్ల నీళ్ళు శాన తక్కువగా కన్పట్త



## నిలువుటద్దం మహా ప్రస్థానం

శ్రీశ్రీగారికి మహా ప్రస్థానాన్ని నిలువుటద్దం సైజులో అచ్చు వేయించాలన్న ఆలోచన వుండేది " ఆయన కోరిక విన్నప్పుడు మీకు ఏమనిపించింది" అని శ్రీశ్రీకి సన్నిహితులైన ఆరుద్ర గారిని ఒక అభిమాని అడిగాడు.

"అనిపించటమేమిటి? అసలా ఆ ఆలోచన నాది. శ్రీశ్రీ కొంతే తీసుకున్నాడు.

వావిళ్ళ వారు వాల్మీకి రామాయణాన్ని తెలుగు లిపిలో ముద్రించి, ముద్రణ పని పూర్తికాగానే పూజ జరిపించి, అలంకరించిన ఏనుగు అంబారీ పైన వుంచి మద్రాసు నగర వీధులలో ఊరేగించారు. మహా ప్రస్థానం గీతాల సంపుటి సిద్ధమై ముద్రణకు ఎదురు చూస్తున్న కాలంలో శ్రీశ్రీ నేనూ నారాయణబాబూ 'సర్రియలిజమ్'లో మునిగితేలుతూ వుండేవాళ్ళం. మహాప్రస్థానం ప్రచురిస్తానని ఎవరైనా పబ్లిషర్ వస్తే దాన్ని నిలువుటద్దం సైజులో అచ్చు వేయాలనే వాడు. ఆ ప్రచురణ మీద ఏమాత్రం నష్టపోవటానికి సిద్ధంగా వున్నావో చెప్పమనే వాడు.

మహాప్రస్థానాన్ని సంపుటిగా తీసుకురావాలని శ్రీశ్రీ అనుకుంటున్నప్పుడు నిలువుటద్దం సైజులో వేయించమని నేనే చెప్పాను - అంతేగాదు అచ్చువేశాక ఒక ఏనుగు మీద ఎర్రశాలువా కప్పి దానిమీద అటొకటి ఇటొకటి రెండు మహాప్రస్థానాలు - నిలువుటద్దం సైజులో అచ్చు వేసినవి వేలాడదీయాలన్నాను. ఇంకా ఆ ఏనుగు మీద ఒక కోతిని కూర్చోబెట్టి దానిచేత డోలు వాయింపజేస్తూ మద్రాసు వీధుల్లో ఊరేగిద్దాం అని కూడా చెప్పాను.

శ్రీశ్రీ సరేనన్నాడు గాని ఆచరణలో ఏం జరగలేదు. మహాప్రస్థానాన్ని నిలువుటద్దం సైజులో వెయ్యాలని మాత్రం అప్పుడప్పుడు అంటూ వుండే వాడు అని ఆనాటి అది వాస్తవిక తలపులను ఆరుద్ర తెలిపారు.

మహాప్రస్థానాన్ని నిలువుటద్దం సైజులో అచ్చు వేయగల ఆది సాహసులెవరైనా వున్నారా?

న్నాయి. సెర్వు నీళ్లు నా పొలానికి పట్టినంక, నీ పొలానికి పారించుకో'' అన్నాడు.

''గదేంది దొరా! నా పొలం పైనుంచి, తూము ముంగల నా పొలం దాటినంకనే నీళ్ళు మీకొత్తయి గని ముంగల మీకెట్ల పార్తయి'' అన్నాడు దుర్గయ్య. దొరకు మండింది.

''గదేం కుదర్దు. పొద్దస్తమానం నీళ్ళు నా పొలం పారాల. రాత్రికి నువ్వు పెట్టుకో'' అన్నాడు.

''గిది అన్యాయం దొరా. నాదేపాటి పొలం! మీరు నెనరు జేయాల'' ప్రాధేయపడ్డాడు. అయినా దొర మనసు కరగలేదు. ఎలాగైనా దుర్గయ్య పొలానికి చెరువు నీళ్ళు పారకుండా చూడాలని నిర్ణయించుకున్నాడు దొర.

''దుర్గా! నీ పొలం పారాలంటే రాత్రిపూట నీళ్ళు పెట్టుకో. పొద్దుందాకా మా పొలం పారనీ'' కటువుగా మాట్లాడాడు. చేసేదేమీ లేక రాత్రివేళల్లో పొలానికి నీళ్ళు పెట్టసాగాడు దుర్గయ్య. దొర, తన జీతగాళ్లకు దుర్గయ్య పొలానికి గండ్లు పెట్టమని ఆజ్ఞాపించాడు. తెల్లవారేసరికి తన పొలంలో నీళ్ళు లేకపోడం, పొలం గట్టు తెగి ఉండటం, దుర్గయ్యకు దొర కుయుక్తి అర్థమైంది.

'' ఈ దొరాయన నన్నెట్లాగనైనా అప్పులపాలు చేయాల్నని అనుకున్నట్లుంది. పైసలున్నోళ్ళతోటి పంచాయతీల నెగ్గలేం'' అనుకొని, షావుకారు ఇంటికి వెళ్ళాడు దుర్గయ్య. షావుకారు పొలానికి చెరువు నీళ్ళు పారటం మూలాన ఆయన కరంటు మోటరు ఖాళీగానే వుంది. దుర్గయ్య పూర్వీకులెవరో తీసిన పొలం బావికి కరంటు మోటారు బిగించి పొలానికి నీళ్ళు పెట్టాలని దుర్గయ్య ఆలోచన. ఎలాగైతేనేం, మోటారు కిరాయికి మాట్లాడి తన బావిపై బిగింపచేయించాడు దుర్గయ్య.

వరి పొలం చూస్తుండగానే పొట్టకు వచ్చింది. అది నీళ్ళు బాగా అవసరం అయ్యే సమయం. లో ఓల్టేజి సమస్య ఉండటం మూలాన, రాత్రివేళ దుర్గయ్య మెలకువగా వుండి పొలానికి నీళ్ళు పెట్టసాగాడు.

ఉన్నట్లుండి ఓరోజు కరెంటు ఆఫీసు నుంచి 'లైన్మను వచ్చాడు. పంచాయతీ ఆఫీసు గదిలో బసచేశాడు. దొర లైన్మన్‌ను కలిశాడు. దొర గడి నుంచి 'దానాపాని' అందింది. దొర లైన్మను దగ్గర్నుంచి సెలవు తీసుకొన్న కొద్దిసేపటికి దుర్గయ్యకి పిలుపొచ్చింది, లైన్మను పిలుస్తున్నాడని. దుర్గయ్యను చూసి లైన్మను

'' ఏం పేరు''

''దుర్గయ్యండీ''

''కరంటు సాంచను లేకుండనే మోటరు నడిపిస్తన్నవటగా? ప్రభుత్వం సొమ్ము పుణ్యానికి వచ్చిందా? నీ మోటరు జప్తుజేత్త. పోలీసు కేసు పెట్టిస్త. నీ మోటరు యాడుందో సూపిద్దు పా'' కుర్చీలోంచి లేచాడు లైన్మను.

ప్రాణాలు పోతున్నట్లు అనిపించింది దుర్గయ్యకి.

''లేదూసార్. గట్లనకండి. వరి పొలం పొట్టకొచ్చింది. ఎండిపోతట్లుంది పొలం. సేతికొచ్చింది కాకుంటైద్ది.

గందుకే మోటరు బిగించిన. తమరు దయసూపించాల'' ప్రాధేయపడ్డాడు దుర్గయ్య.

లైన్మను కాసేపు అదిరించి, బెదిరించి, చివరికి,'' ఆ సరే! కోళ్ళను లెస సాత్తన్నవట. ఓ రెండు మాంచి కోడిపుంజుల పంపియ్యి'' ఆజ్ఞాపించాడు. దుర్గయ్య 'సిత్తం' అంటూ ఇంటికి పరుగెత్తాడు.

రెండు మూడు రోజులు అలా గడిచాయో లేదో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. అన్ని మోటార్లు బందు అయ్యాయి. ఆసాములంతా కలసి తలో అయిదు వందల రూపాయలు వేసుకొని కరెంటు ఆఫీసుకు వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. దుర్గయ్య కరంటు మోటారు వాడుతున్నాడు కాబట్టి అతన్ని కూడా డబ్బులియ్యమన్నారు. దుర్గయ్యకు డబ్బెందుకు ఇవ్వాలో అర్థం కాలేదు.

''డబ్బెందుకే? కరెంటోల్లు ఫిట్టు చెయ్యరా ?!'' అడిగాడు అమాయకంగా.

అది విన్న పెద్దాయన, '' ఓర్నీ! లోకం ఎట్ల నడుత్తందో తెల్వదా బిడ్డా? కరంటోల్ల సేతులు తడపందే పని సేత్తరా?!'' అసలు విషయం చెప్పాడు.

దుర్గయ్యకు తప్పలేదు. మరలా షావుకార్ని అడిగి అయిదొందలు తీసుకొచ్చి డబ్బులు వసూలు చేస్తున్న ఆసామికి ఇచ్చాడు.

చూస్తుండగానే వరి ఎన్ను విరవటం, కోయటం, కుప్పకొట్టడం అయిపోయాయి.

కల్లంలో వడ్లు తూర్పార పడుతుండగా, షావుకారు కిరాయి ట్రాక్టర్ తీసుకొని కల్లం దగ్గరకి వచ్చాడు. వస్తూనే దుర్గయ్యను

''వడ్లు పోతమైనాయా'' ప్రశ్నించాడు.

షావుకార్ని చూస్తూనే దుర్గయ్యకు గుబులుగా అనిపించింది. కల్లంలోంచే వడ్లు తీసుకెళ్ళడానికి వచ్చాడని దుర్గయ్య అర్థం చేసుకున్నాడు.

''పొతమైనట్లే! ఈయేడు అన్నీ ఇబ్బందులే అయినై.కొంత కాలం ఆగకూడదా తమరు'' బతిమలాడే ధోరణి వ్యక్తపరిచాడు దుర్గయ్య.

''గదేం మాట. పైసలు తీస్కపోయేటప్పుడు తెల్వదా? బాకీ కింద వడ్లు కొల్చుకపోతా'' అన్నాడు షావుకారు కఠినంగా.

అన్నదే తడవుగా, రాశికి కుంచం వేసి కొల్వటం మొదలుపెట్టాడు షావుకారు.



దుర్గయ్యకు నోటమాట పెగలలేదు.

'' ఆరుగాలం సేత ఒక్క గంటలో షావుకారు మింగిండని'' దిగులుగా కల్లం బండపై చతికిలబడ్డాడు దుర్గయ్య.


షావుకారు అసలు వడ్డీలు కలుపుకొని బాకీకింద తీసుకపోయిన వడ్లుకాక, కొద్దిగా మిగిలాయి. వాటిని దుర్గయ్య దంపతులు చెరో గంపలో ఎత్తుకొని ఇంటి ముఖం పట్టారు.

ఆరోజు రాత్రి దుర్గయ్య, యల్లమ్మతో ''మనూళ్ళనే ఉంటే మనం ఆకలిసావు సావాల్సి వత్తది. ఊరొదిలి పోరన్ని తీస్కోని పట్నం బతక బోదం. ఇటుకలు మోసి బతుకెళ్ళదీద్దం'' అన్నాడు. యల్లమ్మకు ఊర్ని వదలాలంటే దిగులుగా అనిపించింది. అయినా తప్పదు.

***

నారాయణ సూరత్‌కు వచ్చి సంవత్సరం దాటింది. ఒక వారం రాత్రి షిఫ్టు, మరో వారం పగటి షిఫ్టు కావటంతో తొలుత నారాయణకు ఇబ్బందిగా అనిపించింది. దీనికితోడు ఇరుకు గదులు, పూటకూళ్ళ భోజనాలు! ఎలాగోలా అలవాటు చేసుకున్నాడు నారాయణ.

'గణేష్ చతుర్థి' వచ్చింది. అక్కడి జనం పండగ బాగా చేసుకుంటారని విన్నాడు నారాయణ. జనం



## షాప్‌లిఫ్టర్

సౌత్ కరోలినా రాష్ట్రంలోని సీపైన్స్ అనే వూళ్ళో పాల్ రోమన్ అనే 75 ఏళ్ళ వృద్ధుడు చట్టానికి తమాషాగా పట్టుబడ్డాడు. ఆ ఊళ్ళోని పోలీస్ ట్రైనీకి శిక్షణలో భాగంగా ఓ సూపర్ మార్కెట్‌కి తీసుకెళ్ళి షాపులోంచి బయటికి వస్తున్న వాళ్ళు కొన్న సామానుని వాళ్ళ బిల్లుతో పోల్చిచూసి బిల్ చెల్లించకుండా దొంగతనంగా వస్తువులను తెచ్చే నేరస్థులని కనిపెట్టే విషయంలో శిక్షణ మొదలుపెట్టారు. నాలుగో కస్టమరైన మన పాల్‌గారి జేబుల్లో సెంట్‌బాటిల్, వైన్ బాటిల్, రెండు సిగరెట్ పాకెట్లు, థాయ్‌లాండ్ నుంచి దిగుమతి చేసుకున్న పుట్టగొడుగుల పాకెట్ దొరికాయి. వీటి మొత్తం విలువ నూట తొమ్మిది డాలర్ల తొంభై ఏడు సెంట్లు!

వాటిని ఎందుకు దొంగిలించావని పోలీసులు అడిగితే అతను చెప్పిన సమాధానం ''అంత ఖరీదైనవి నేనెప్పుడూ కొనను''



ఉత్సాహంగా పండగ ఏర్పాట్లు చేస్తుంటుంటే తాను కూడా సంబరాల్లో పాలుపంచుకోసాగాడు. వాడవాడల తిరిగి చందాలు వసూలుచేసి, వినాయక విగ్రహాన్ని దర్శనానికి ఉంచారు. రెండు మూడు రోజులు ప్రశాంతంగానే ఉంది ఆ వాడ. ఉన్నట్లుండి విగ్రహంపై ఎవరో రాళ్ళు విసిరారు. అంతే... వదంతులు వ్యాపించాయి. మత కలహాలు సృష్టించబడ్డాయి. ఎక్కడి నుంచి వచ్చారో ఏమో! కొంత మంది కత్తులతో మెరుపుదాడి చేసి దొరికిన వార్ని దొరికినట్లు నరకసాగారు. ఎవరు ఎవర్ని చంపుతున్నారో అర్థంకాని పరిస్థితి. సూరత్ పట్టణం అట్టుడికి పోయింది. నారాయణకు అంతా గందరగోళంగా అనిపించింది. గృహ దహనాలు మొదలయ్యాయి. నారాయణ ఉన్న ఇల్లు కూడా అగ్నికి ఆహుతి అయింది. కష్టపడి సంపాదించిన డబ్బు కాలిపోయింది. కట్టుబట్టలే మిగిలాయి. కొంతమంది తెలుగు వాళ్లతో కలసి రైలెక్కి ఇంటికి వచ్చాడు.

జరిగినదంతా విని నారాయణ భార్య లక్ష్మి బావురుమంది.

'' ఏదో.. బతికి బయటపడ్డవు. అంతేచాలు. నా మాంగల్యం గట్టిది'' మంగళసూత్రాన్ని కళ్ళకద్దుకుంది లక్ష్మి.

ఆరోజే మగ్గం గుంటను శుభ్రం చేశారు నారాయణ దంపతులు.

***

పట్నం వచ్చిన దుర్గయ్య దంపతులకు కాలం త్వరగా గడిచిపోతున్నట్లనిపించింది. చూస్తుండగానే తమ కళ్ళ ముందే ఎన్నో బిల్డింగులు రూపుదిద్దుకున్నాయి. మొదట కట్టెల మీద నిలబడి, ఇటుకలు అందియ్యటం ఇబ్బందిగా అనిపించేది దుర్గయ్యకు. ప్రతిరోజు యల్లమ్మ జాగ్రత్తలు చెబుతూనే వుండేది. ఓరోజు దుర్గయ్య కట్టెల మీద నిలబడి తాపీ పని చేస్తుండగా, క్రేన్ కొక్కెం వదులై, విసురుగా వచ్చి దుర్గయ్యను తాకింది. రెండు అంతస్తుల ఎత్తు నుంచి 'అమ్మా' అంటూ దుర్గయ్య నేలకూలాడు. దూరంగా పనిచేస్తున్న యల్లమ్మ గుండెలు బాదుకుంటూ పరిగెత్తుకొచ్చింది. రక్తపుమడుగులో విలవిలలాడుతూ దుర్గయ్య ప్రాణం వదిలాడు.

కంట్రాక్టరు, పోలీసులు వచ్చారు. తోటి కార్మికులు లక్ష రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని అడిగారు. కంట్రాక్టరు, పోలీసుల్తో లాలూచీపడి పది వేల రూపాయలు ఇచ్చాడు.

యల్లమ్మకు పట్నం దగాకోరులా కనిపించింది. చుట్టూ వున్న మనుషులు అదోలా కనిపించారు. ప్రతిరోజు నవ్వుతూ తన భర్తను పలకరించి, 'అది' ' ఇది' మాట్లాడిన కంట్రాక్టరులో కొత్త వ్యక్తి కనిపించాడు యల్లమ్మకు. ఆమె పట్నంలో ఉండదల్చుకోలేదు. కలో గంజో తాగి ఉన్న ఊళ్ళోనే కాలం వెళ్ళదీయాలని నిర్ణయించుకుంది యల్లమ్మ. తక్షణమే తన పదిహేనేళ్ళ కొడుకును తీసుకొని ఊరుకు ప్రయాణమైంది.

ఊరు చేరిన యల్లమ్మకు ఊరెంత మారిందో అర్థమైంది. ఊరు తీవ్ర కరవు పరిస్థితుల్లో కొట్టుమిట్టాడసాగింది. ఊర్లోని పాత తరం, గుడిసెల పట్టుకొని జీవనం కొనసాగిస్తుండగా, నవతరం జీవనోపాధి కోసం వలసపోయారు. నారాయణ కుటుంబం ఆకలిదప్పులతో అల్లల్లాడుట యల్లమ్మ గమనించింది. వచ్చిన రెండుమూడు రోజుల్లో కూలటానికి సిద్ధంగా వున్న ఇంటిని కొడుకుతో కలిసి బాగు చేసుకుంది యల్లమ్మ. నారాయణ దంపతులు తమ ఆర్థిక పరిస్థితుల్ని యల్లమ్మతో చెప్పుకోలేకపోతున్నారు. వారి స్థితిని లోతుగా విచారించాక, 'కలో గంజో కలిసి తాగుదాం' అన్నది. ఓ బలవంతపు చిరునవ్వు నవ్వారు నారాయణ దంపతులు.

ఓ రాత్రివేళ నారాయణ లక్ష్మిలు తమ గతాన్ని ఆనందంగా నెమరు వేసుకున్నారు. ఒకప్పుడు తను నేసిన బట్టలకు ఎటువంటి గిరాకి వుండేదో, ఎక్కడెక్కడ నుంచి నేత బట్టలకు వచ్చేవారో నారాయణ చెబుతుంటే లక్ష్మి ఆనందంగా విన్నది. ఎన్నడూ లేనిది భర్త గతాన్ని ఆనందంగా నెమరు వేసుకుంటుంటే లక్ష్మిలో కించిత్ అనుమానం రాకపోలేదు. భర్త ఉల్లాసం మాటల్లో పడి ఎగదన్నుతున్న అనుమానాన్ని తొక్కిపట్టి ఉంచింది.

ఆరాత్రి ఎప్పటిలాగానే తెల్లారింది. పక్కనున్న కాళ్ళకట్టు మంచంపై నారాయణ కనిపించకపోయేసరికి లక్ష్మిలో గాభరా పెరిగింది.

''మనిషి ఇంత పొద్దున్నే యాడికి పోయిండబ్బా'' అనుకుంటూ తెరచి ఉన్న తలుపును చూసి ఒకింత ఆశ్చర్యంతో ఇంటి వెనకకు వచ్చింది ఆమె. అక్కడ దృశ్యం చూసి కుప్పకూలింది లక్ష్మి. నారాయణ 'సరి' గుంజకు ఉరేసుకున్నాడు. ఆమెకు ప్రపంచం ఒక్కసారిగా చీకటిగా అనిపించింది.

''కుటుంబం పోషించలేక ఉరేసుకున్నావా! అయ్యో!'' అని రోదించింది. ఒక నిర్ణయానికి వచ్చిన దానిలా ఒక్క ఉదుటున లేచి, చేదబావిలో దూకింది నారాయణ భార్య. అది నీళ్ళు లేని బావి.

రెండు రోజులు గడిచాయి. నారాయణ ఇంటి నుంచి దుర్గంధం రావటంతో యల్లమ్మకు అనుమానం వచ్చి, ఊరి వారి సహకారంతో ఇంటి తలుపులు బద్దలు కొట్టించి లోపలికి ప్రవేశించింది...

కుళ్ళు కుళ్ళయిన నారాయణ లక్ష్మిల శరీరాల్ని వారి మగ్గం గుంటలో పూడ్చిపెట్టారు. ఆ తర్వాత ఇంటికి కంప పెట్టారు.

''ఆకలి సావు సచ్చింద్రు'' జనం అనుకున్నారు.

పత్రికల వారు వచ్చారు. ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే కూడా వచ్చాడు.

''ఇదన్యాయం. నేను ఒక్క తీరుగా ఖండిస్తున్నా. అధికార ప్రభుత్వం పనితీరుకు ఇది నిదర్శనం. వచ్చే ఎన్నికల్లో మాకు అవకాశం ఇస్తే ఇలా జరగనీయం'' ఆవేశంగా గొంతు చించుకున్నాడు. జనం హర్షధ్వానాలు పలికారు. పత్రికల వాళ్ళు ఎమ్మెల్యే ప్రసంగాన్ని మొదటి పేజీలో ప్రచురించారు. ప్రతిపక్షం, నారాయణ దంపతుల 'మరణం'పై అడిగిన ప్రశ్నకు, ప్రభుత్వం దర్యాప్తు జరిపిస్తామని హామీ ఇచ్చింది.

శీతాకాలం వచ్చింది. పక్కింటి బాపయ్య, నారాయణ ఇంటి తలుపులు ఊడబెరికి తీసుకెళ్ళాడు. మూలన వున్న నూలు వడికే రాట్నాన్ని, మగ్గాన్ని తదితర చేనేత సంబంధ పనిముట్లను గొడ్డలితో నరికి పొయ్యిలో పెట్టడానికి తీసుకెళ్లాడు. సరి గుంజను మాత్రం వదలివేశాడు – నారాయణ ఉరేసుకున్నాడని దానికి.

చూస్తుండగానే శీతాకాలం పోయింది, ఎండాకాలం పోయింది. వర్షాకాలం మొదలవ్వుతుందన్న సూచకంగా నల్లమబ్బులు గుమికూడా గరగర మనసాగాయి.


ఇంటి కడపకు ఈవల కూర్చొని చేతికందిన రాళ్ళను విసిరేస్తూ ఆకాశం వైపు చూడసాగింది యల్లమ్మ. తల్లిని చూసి, ''ఏందమ్మా! దిగులుగ కూకున్నవు?'' అడిగాడు దుర్గయ్య కొడుకు.

ఆలోచన తెగిపోయి, కొడుకు వైపు చూసింది యల్లమ్మ. ఆమెకు దుర్గయ్య పాడిన పాట ఆమె చెవుల్లో ప్రతిధ్వనించసాగింది.

''సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మో
సినబోయి కూకున్న వెందుకమ్మో...''

''అమ్మా! సప్పుడు సెయ్యవేందే?'' ప్రశ్నించాడు కొడుకు యల్లమ్మను.

మూలనున్న నాగలి కర్రను సరిచేస్తున్న కొడుకును చూస్తున్న కొద్దీ, ఆమె ముఖంలో దిగులు మాయమై చిరునవ్వు చోటు చేసుకోసాగింది.



## సెల్‌ఫోన్

నార్వే దేశంలోని ఓస్లో నగరంలో ఓ రాత్రి ఇద్దరు దొంగలు వరసగా రెండు మసాజ్ పార్లర్లకి వెళ్ళి అక్కడున్న అమ్మాయిలకి తుపాకులు చూపించి క్యాష్‌బాక్స్ లోని నగదుని దోచుకున్నారు. వాళ్ళలో ఒకడు ఓ యువతి మొబైల్ ఫోన్‌ని కూడా దొంగిలించాడు.

ఆ ఇద్దరు దొంగలు ఓ బార్‌లోకి వెళ్ళి బీర్ తాగుతుండగా పోలీసులు ఆ మొబైల్ ఫోన్‌కి ఫోన్ చేశారు. ఆ యువతి కోసం మాట్లాడుతున్నట్టుగా మాట్లాడారు పోలీసులు.

ఆ యువతి నంబర్ మారిందని చెప్పాడు దొంగ. అయితే బ్యాక్‌గ్రౌండ్‌లో బార్‌లోని మ్యూజిక్ వినబడడంతో దొంగలు ఏదో బార్‌లో వున్నారని గ్రహించిన పోలీసులు కొద్ది నిమిషాల్లోనే మొబైల్ ఫోన్‌కి ఆన్సరిచ్చిన ఏరియాలోని ఓ బార్‌లో ఆ దొంగలిద్దరినీ అరెస్ట్ చేశారు.